సాక్షి
కుమురం భీం
మంగళవారం । 5 । డిసెంబర్ । 2023



పాలు కల్తీ..
స్వచ్ఛమైన పాలు విక్రయించాల్సిన వ్యాపారులు 'కల్తీ' వ్యాపారం సాగిస్తున్నారు. గేదెపాల పేరుతో ప్యాకెట్ పాలు కలిపి ప్రజలకు విక్రయిస్తున్నారు. 8లో▸



గుబులు పుట్టిస్తున్న 'మిచాంగ్'
మిచాంగ్ తుపాన్ రైతుల కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఆకాశం పూర్తిగా మబ్బులు పట్టి ఉండటంతో ఆందోళన చెందుతున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
27.9 /21.0

వాతావరణం
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు డయల్ యువర్ డీఎం

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ డిపో పరిధిలోని ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ శ్రీధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు 99592 26006 నంబర్‌కు ప్రయాణికులు ఫోన్ చేసి సలహాలు, సూచనలు అందించాలని కోరారు.

'పది' విద్యార్థులపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న డీఈవో అశోక్

ఆసిఫాబాద్‌రూరల్: పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఈవో అశోక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, ఎంఈవోలు, నోడల్ అధికారులతో తొలిమెట్టు, ఉన్నతి, లక్ష్య కార్యక్రమాల అమలుపై సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఈ నెలాఖరులోగా అన్ని పాఠశాలల్లో సిలబస్ పూర్తి చేసి పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. ఉన్నత, తొలిమెట్టు కార్యక్రమాలను మానిటరింగ్ చేసేటప్పుడు ప్రధానంగా ఆరు అంశాలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించాలనే ఉద్దేశంతో తీసుకువచ్చిన లక్ష్య కార్యక్రమంలో భాగంగా ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. ఎస్‌వో శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ యాప్‌లో తప్పనిసరిగా మానిటరింగ్ వివరాలు అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రతీ మూడో శనివారం పేరెంట్స్, టీచర్ల సమావేశం నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో పరీక్షల నిర్వహణ అధికారి ఉదయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

'సిర్పూర్' అభివృద్ధే ప్రధాన ఎజెండా

- అన్ని వర్గాలను కలుపుకొని ముందుకు సాగుతాం
- ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌టౌన్: సిర్పూర్ నియోజకవర్గ అభివృద్ధే ప్రధాన ఎజెండాగా.. అన్ని వర్గాల ప్రజలను కలుపుకుని ముందుకు సాగుతామని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దివంగత పురుషోత్తంరావు ఆశయాలు కొనసాగిస్తానని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే మారారని, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం మారిందని.. ఇకనైనా పోలీసులు, రెవెన్యూ అధికారులు తమ వైఖరిని మార్చుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో నియోజవర్గాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. అధికార పార్టీలో లేకున్నా గతంలో తన తండ్రి పనిచేసిన విధంగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అసెంబ్లీలో తామే ప్రధాన ప్రతిపక్షంగా కొట్లాడుతామని స్పష్టం చేశారు. తన గెలుపునకు సహకరించిన బెంగాలీలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. బెంగాలీ కులస్తులకు ఎస్సీ సర్టిఫికెట్, సాగునీటి కల్పన, పశ్చిమ బెంగాల్‌కు ప్రత్యేక రైలు ఏర్పాటుకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు ఆయనను పూలమాలలతో సన్మానించారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, నాయకులు కొంగ సత్యనారాయణ, ఈర్ల విశ్వేశ్వర్‌రావు, వెంకటేష్, వీరభద్రచారి, సిందం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటారని ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. పాఠశాల ఆవరణలో సోమవారం పీడీ తిరుపతితో కలిసి విద్యార్థులను అభినందించారు. ఇటీవల 7 బ్లాక్ ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. అండర్ 17 విభాగంలో పాఠశాలకు చెందిన షణ్ముక తేజ, మోక్షిత్ సాయి, ఎండీ మాజ్, రోహిత్, రోహన్, తౌఫిక్, కార్తీక్, సిద్దు, అభిలాష్, నందకిషోర్ ప్రతిభ చూపారని పేర్కొన్నారు.

తెరవెనుక శ్రామికులు

హమ్మయ్య.. ఎన్నికల ఘట్టం ముగిసింది. గెలిచిన వారికి ఆనందం.. ఓడిన వారికి ఆవేదనను మిగిల్చిన అసెంబ్లీ ఎన్నికలు చివరి వరకూ ఉత్కంఠ రేపాయి. ముందే ఊహించిన ఫలితాలు రావడంతో ప్రజల్లో ఉత్సాహం నింపాయి. అంతా ఎన్నికల ఫలితాలతోనే ముగిసిపోయిందనుకున్నారు. వాస్తవానికి ఈ ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపునకు కృషి చేసిన వారు, తెరవెనుక ఉండి వ్యూహాలు రూపొందించిన వారు అనేక మంది ఉన్నారు. తాజ్‌మహల్ నిర్మాణానికి రాళ్లెత్తిన కూలీల్లాగా అభ్యర్థుల గెలుపుకోసం తీవ్రంగా శ్రమించారు.

- అభ్యర్థుల గెలుపులో పార్టీ నేతలు, ద్వితీయ శ్రేణి నాయకుల కృషి
- విజయం కోసం వ్యూహ ప్రతివ్యూహాలతో ముందుకు..
- ప్రజలను ఆకట్టుకునేందుకు పక్కా ప్రణాళికలు
- మండలాలు, సామాజిక వర్గాల వారీగా ఓట్లు రాబట్టుకునేలా కృషి



సాక్షి, ఆసిఫాబాద్: జిల్లాలోని ఆసిఫాబాద్ నియోజకవర్గం పరిధిలో 10, సిర్పూర్ పరిధిలో 7 మండలాలు ఉన్నాయి. ఒక్కో మండలంలో భిన్నమైన రాజకీయ పరిస్థితులు, స్థానికుల ఆశలు, ఆశయాలకు అనుగుణంగా నేతలు మసలుకోవాల్సి వచ్చింది. కొన్ని మండలాల్లో ఓటర్లను ప్రభావం చూపే నాయకులు ఉన్నారు. వారిని ప్రసన్నం చేసుకుని వారి వెంట ఉన్న జనం ఓట్లు రాబట్టుకునే విధంగా పార్టీలు వ్యూహాలు రచించాయి. ఆయా పార్టీల్లో దీని కోసం శ్రమించిన వారెందరో ఉన్నారు. ఇందులోనూ సందెట్లో సడేమియా అన్నట్లు చిల్లరకొట్టుడు ఛోటా నాయకులతో అభ్యర్థులకు తలనొప్పులు తప్పలేదు.

విజయానికి సమష్టి కృషి

సిర్పూర్ నియోజకవర్గానికి సంబంధించి ప్రధానమైన కాగజ్‌నగర్ పట్టణ ఓటర్లు తమ వెంటే ఉంటారని బీఆర్‌ఎస్ అభ్యర్థి కోనేరు కోనప్ప ఆశించారు. దీంతో ఆయన ధీమాగా ఉన్నారు. అయితే బీజేపీ అభ్యర్థి పాల్వాయి హరీశ్‌బాబు విజయానికి ఆ పార్టీలోని కాగజ్‌నగర్ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని బలమైన శ్రేణులు తలో చేయి వేయడంతో గెలుపు సునాయాసం అయింది. ఇక్కడ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొంగ సత్యనారాయణ, వీరభద్రచారి, పార్టీ నాయకులు సిందం శ్రీనివాస్, గోలెం వెంకటేశ్, దెబ్బటి శ్రీనివాస్, కల్లోల భట్టాచార్యులు పట్టణంలో వార్డుల వారీగా బాధ్యతలు తీసుకుని అక్కడి స్థానిక బృందాలను కలుపుకొని వెళ్లారు. ఇక బీజేపీ అభ్యర్థి హరీశ్‌బాబుకు అత్యధిక మెజార్టీ అందించిన బెంగాలీ క్యాంపులో రాంనగర్ ఎంపీటీసీ బీకాస్ గరామీ, ఆయన భార్య నజ్రుల్‌నగర్ సర్పంచ్ అనుపమ గరామీలు కృషి చేశారు. అలాగే కౌటాల మండలంలో హరీశ్‌బాబు ముఖ్య అనుచరుడు గౌడ సంఘం నేత బండి రాజేందర్‌గౌడ్, బెంగాలీ వర్గం నేత మృత్యుంజయ కవిరాజు, ఆరె సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు వానూ పటేల్ తదితరులు స్థానికంగా ప్రభావం చూపించారు. చింతలమానెపల్లి మండలంలో మాజీ జెడ్పీటీసీ ఎనుమల మల్లయ్య, ఎంపీటీసీ భర్త సుధాకర్.. దహెగాం మండలంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పుప్పాల సత్యనారాయణ, మండల అధ్యక్షుడు రాపర్తి ధనుంజయ్.. పెంచికల్‌పేట్ మండలంలో పార్టీ అధ్యక్షుడు జునువరి మధుకర్, ఘనపురం నగేష్, చప్పిడే సత్యనారాయణ... సిర్పూర్(టి) మండలంలో జెడ్పీటీసీ నీరటి రేఖ, ఆమె భర్త సత్యనారాయణ, వడ్డేటి నాని, నేరెళ్ల అశోక్.. బెజ్జూర్ మండలంలో పార్టీ మండల అధ్యక్షుడు బాలకృష్ణ, మాజీ ఎంపీపీలు కొండ్ర మనోహర్, కొప్పుల శంకర్, పాల్వాయి శ్రావణ్, ఎంఆర్‌పీఎస్ నేత బ్రహ్మయ్య తదితరులు ఎన్నికల్లో బీజేపీ ఆధిక్యం వచ్చేందుకు పనిచేశారు.

ప్రతికూలత ఉన్నా.. ప్రభావం చూపారు

ఆసిఫాబాద్ నియోజకవర్గ అభ్యర్థి విజయానికి కార్యకర్తలతోపాటు ద్వితీయ శ్రేణి నాయకులు ప్రధాన భూమిక పోషించారు. కాంగ్రెస్ పార్టీ గాలిలో బీఆర్‌ఎస్‌కు కొంత ప్రతికూలత కనిపించింది. అయితే కాంగ్రెస్ బలంగా ఉన్న మండలాల్లో ఓట్లు బీఆర్‌ఎస్ వైపు పూర్తిగా మొగ్గడంతో ఆ పార్టీ అభ్యర్థి కోవ లక్ష్మిని విజయం వరించింది. ఆసిఫాబాద్ మండలంలో బీఆర్‌ఎస్ అభ్యర్థికి అనుకున్న మెజార్టీ రాకపోయినా అధిక సంఖ్యలో ఓట్లు సాధించగలిగారు. పార్టీ రాష్ట్ర నాయకుడు అరిగెల నాగేశ్వరరావు, అరిగెల మల్లికార్జున్, గంధం శ్రీను, మైనార్టీ నాయకులు అబ్దుల్లా తదితరులు స్థానిక కార్యకర్తలతో కలుపుకుని పార్టీ విజయానికి కృషి చేశారు. కెరమెరి మండలంలో మాత్రం సమీకరణాలు మారిపోయాయి. ఇక్కడ కాంగ్రెస్ పట్టు సాధిస్తుందని ఆ పార్టీ నేతలు అంచనాలు వేశారు. కానీ స్థానికులైన అబ్దుల్ కలాం, దేవిదాస్ గురూజీ, ఆత్రం బొజ్జురావు, మోర్లే శంకర్, ప్రేమలాబాయి ప్రభావం చూపించడంతో బీఆర్‌ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మి ఆధిక్యం సాధించారు. తిర్యాణి మండలంలో కాంగ్రెస్‌కు బలమైన ఓటు బ్యాంకు ఉంది. ఇక్కడ పార్టీ మండల అధ్యక్షుడు హనుమాండ్ల జగదీష్, సిట్టింగ్ ఎమ్మెల్యే కుమారుడు ఆత్రం వినోద్, జెడ్పీటీసీ చంద్రశేఖర్, నాయకులు శ్రీదేవీ, గుణవంతరావులతోపాటు సర్పంచులు, పటేళ్లు, సార్‌మెడీల కృషితో కోవ లక్ష్మి ఆధిక్యం సాధించింది. రెబ్బెన మండలంలోనూ పార్టీ నేతలు పోటు శ్రీధర్‌రెడ్డి, పల్లె ప్రకాశ్‌రావు, నంబాల సర్పంచ్ సోమశేఖర్, తదితరులు బీఆర్‌ఎస్ విజయానికి కృషి చేయడంతో ఈ మండలంలో కోవ లక్ష్మికి మెజార్టీ వచ్చింది. సిర్పూర్(యూ) మండంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి కుమార్తె, జెడ్పీటీసీ కోవ అరుణ వ్యూహ ప్రతివ్యూహాలు రచించారు. స్థానిక నేతలు తోడసం శ్రీను, ఆత్రం జాలీంషా, వీణాబాయి తదితరులను సమన్వయం చేసుకుంటూ పనిచేశారు. దీంతో ఇక్కడ మెజార్టీ సులభంగా వచ్చింది. జైనూర్ మండలంలో పార్టీ అధ్యక్షుడు ఇంతీయాజ్ లాల్, పీఏసీ చైర్మన్ కొడప హన్నుపటేల్, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు అబూత్ అలీ పార్టీ అభ్యర్థి విజయానికి ఎంతో కృషి చేశారు. లింగాపూర్ మండలంలో సిట్టింగ్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు సోదరుడు ఆత్రం అనిల్ అన్నీ తానై నడిపించారు. ఇక్కడ స్థానిక నేతలు జాథోడ్ రాహుల్, కంచన్‌పల్లి సర్పంచ్ కనక జ్యోతిరాం, సంగీత వినోద్ రాథోడ్‌లను కలుపుకొని పని చేశారు. ఇక వాంకిడి మండలంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మి విజయం కోసం జెడ్పీటీసీ అజయ్‌కుమార్, సర్పంచ్ బి.తుకారాం, బొంబార సర్పంచ్ ఆయూబ్, ఎస్సీ, ఎస్టీ సెల్ కమిటీ సభ్యులు మహాల్కర్ అశోక్ తదితర నాయకులు పనిచేశారు. నార్నూర్‌లో మైనార్టీ నేత సయ్యద్ ఖాశీం, సర్పంచులు హనుమంతరావు, గజానంద్ నాయక్, మాజీ .ఓడ్పీటీసీ జ్ఞానోభ పుష్కర్‌లు... గాదిగూడ మండలంలో పార్టీ అధ్యక్షుడు బాజీరావు, ఎంపీపీ అడ చంద్రకళ, అడ రాజు, మండల ఉపాధ్యక్షుడు యోగేశ్, జర్రీ సర్పంచ్ జాకు తదితరులు వ్యూహ ప్రతివ్యూహాలు రచించి ఇక్కడ కోవ లక్ష్మి మెజార్టీ సాధించేందుకు సహకరించారు.

కోవ లక్ష్మికి శుభాకాంక్షల వెల్లువ



కోవ లక్ష్మికి పుష్పగుచ్ఛం అందిస్తున్న మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్

ఆసిఫాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కోవ లక్ష్మికి సోమవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావుతోపాటు పార్టీ నాయకులు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు. కెరమెరి, రెబ్బెన, తిర్యాణి తదితర మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ అత్యధిక మెజార్టీతో గెలిపించిన ప్రజలు, విజయానికి కృషి చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

హైదరాబాద్‌కు పయనం

ఎన్నికల ఫలితాలు వెలువడడంతో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ విజయం సాధించిన పార్టీ ఎమ్మెల్యేలతో సోమవారం హైదరాబాద్‌లో సమావేశం నిర్వహించారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యేగా గెలుపొందిన కోవ లక్ష్మి ఈ మేరకు ఆసిఫాబాద్ నుంచి హైదరాబాద్‌కు పయనమయ్యారు. పార్టీ సమావేశంలో పాల్గొన్నారు.

గడువులోగా పరీక్ష ఫీజు చెల్లించాలి

ఆసిఫాబాద్‌రూరల్: పదో తరగతి విద్యార్థులు గడువులోగా వార్షిక పరీక్షల ఫీజు చెల్లించాలని డీఈవో అశోక్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 8లోగా ఎలాంటి ఆలస్య రుసుం లేకుండా ఫీజు చెల్లించవచ్చని తెలిపారు. ఆలస్య రుసుం రూ.500తో జనవరి 4వ తేదీ వరకు చెల్లించే అవకాశం ఉందన్నారు. జిల్లాలో విద్యార్థులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

స్థానికుడికే పట్టం



ప్రచారంలో మహిళలతో కలిసి నినాదాలు చేస్తున్న పాల్వాయి హరీశ్‌బాబు (ఫైల్)

- హరీశ్‌బాబుకు కలిసొచ్చిన 'పాల్వాయి' పాలన
- ప్రజల్లోకి 'స్థానికత' అంశాన్ని తీసుకెళ్లడంలో సక్సెస్
- ఫలితాన్నిచ్చిన అగ్రనేతల సభలు
- త్రిముఖ పోరులో బీజేపీదే విజయం

కౌటాల(సిర్పూర్): సిర్పూర్ నియోజకవర్గ ప్రజలు 2023 అసెంబ్లీ ఎన్నికల్లో స్థానికుడికి పట్టం కట్టారు. తెలంగాణలో తొలి నియోజకవర్గమైన సిర్పూర్‌లో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, బీఆర్‌ఎస్ సీనియర్ నేత కోనేరు కోనప్ప పోటీలో ఉండటంతో రాష్ట్రవ్యాప్తంగా ఇక్కడి ఫలితాలపై ఆసక్తి నెలకొంది. ఉత్కంఠ పోరులో దివంగత నేత పాల్వాయి పురుషోత్తంరావు తనయుడు హరీశ్‌బాబు విజయం సాధించారు. తల్లిదండ్రుల వారసత్వంతో రాజకీయాల్లో వచ్చిన హరీశ్‌బాబు.. సిర్పూర్‌లో 'పాల్వాయి' పాలన తీసుకువస్తానని విస్తృతంగా ప్రచారం చేశారు. స్థానికత, తండ్రి హయాంలో జరిగిన అభివృద్ధి ప్రస్తుత విజయానికి బాటలు వేసిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుత విజయంతో ఒకే కుటుంబానికి చెందిన తండ్రి, తల్లి, తనయుడు ఎమ్మెల్యేలుగా గెలుపొంది చరిత్ర సృష్టించారు.

స్థానికుడిగా పీపీరావు జైత్రయాత్ర..

సిర్పూర్ నియోజకవర్గంలో 1952 నుంచి ఎన్నికలు జరుగుతున్నాయి. 70 శాతం బీసీలు, 20 శాతం ఎస్సీలు, ఎస్టీలు, 8 శాతం మైనార్టీలు, కేవలం రెండు శాతంలోపే అగ్రకులాలకు చెందిన ఓటర్లు ఉన్నా సమస్యలపై పోరాడిన వారినే ఎన్నుకుంటూ వస్తున్నారు. బెజ్జూర్ మండలం రెబ్బెన గ్రామానికి చెందిన పాల్వాయి పురుషోత్తంరావు(పీపీ రావు) ఇక్కడ జైత్రయాత్ర సాగించారు. 1989, 1994లో వరుసగా రెండుసార్లు స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగి సిర్పూర్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1999 ఎన్నికల ముందు పీపీరావును నక్సలైట్లు కాల్చి చంపడంతో ఆ ఎన్నికల్లో ఆయన సతీమణి రాజ్యలక్ష్మి పోటీ చేసి విజయం సాధించారు.

ప్రజా జీవితంలోకి అడుగు..

పాల్వాయి హరీశ్‌బాబు వైద్యకోర్సు పూర్తి చేసి వైద్యుడిగా సేవలందించారు. సిర్పూర్ ప్రజల పక్షాన అండగా ఉండాలని.. తండ్రి పీపీరావు అడుగుజాడలో నడవాలని నిర్ణయించుకున్న అనంతరం 2017 నవంబర్‌లో రాజకీయ అరంగ్రేటం చేశారు. బెజ్జూర్ మండలం రెబ్బెన గ్రామంలో 10 అంశాలతో రాజకీయ ఎజెండా రూపొందించుకుని ప్రజల్లోకి వచ్చారు. 2018 డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తర్వాత కాంగ్రెస్‌ను వీడి బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. నియోజకవర్గంలోని మారుమూల ప్రాంతాలకు పాదయాత్ర చేపట్టారు. సిర్పూర్ నియోజకవర్గంలో కబ్జాలు, సమస్యలపై పోరాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. బీజేపీ ప్రకటించిన బీసీ సీఎం, డబుల్ ఇంజిన్ సర్కార్, 'పాల్వాయి' పాలనతోనే సాధ్యమని నమ్మకం కలిగేలా ప్రచారం చేశారు. స్థానికత వ్యూహం ఫలిస్తుందని నమ్మి ఆ దిశగా అడుగులు వేశారు. 'ఆంధ్ర ముసలి ఎద్దుకు విశ్రాంతినిచ్చి ఈ రెబ్బెన కోడెకు అవకాశం ఇవ్వాలి' అంటూ ప్రచారంలో దూసుకెళ్లారు.

వరుస సభలు.. ఎన్నికల వ్యూహాలు

ఎన్నికల సమయంలో బీజేపీ అగ్రనేతల ప్రచారం హరీశ్‌బాబు గెలుపునకు కలిసొచ్చింది. సిర్పూర్(టి) మండల కేంద్రంలో నిర్వహించిన బహిరంగ సభలో కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ పాల్గొనడం పార్టీ శ్రేణుల్లో జోష్ పెంచింది. ఈజ్‌గాంలో కేంద్ర మంత్రి, కాగజ్‌నగర్‌లో మహారాష్ట్ర మాజీ సీఎంతోపాటు యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ సభలు మరింత ఊపును తెచ్చాయి. పదేళ్లుగా అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ పాలనలో సిర్పూర్ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి కన్నా అక్రమాలు, అవినీతి ఎక్కువంటూ బీజేపీ చేసిన ప్రచారం జనాల్లోకి చొచ్చుకెళ్లింది. 2018 ఓటమి కూడా ఓటర్లలో సానుభూతిని పెంచింది. ముఖ్యంగా యువత సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేశారు. నాయకులు, కార్యకర్తలంతా బృందాలుగా విడిపోయి అన్ని ప్రాంతాలను సందర్శించారు. ముఖ్యంగా బెంగాలీల ఓట్లు గంపగుత్తగా బీజేపీకే రావడంతో పాల్వాయి గెలుపు ఖాయమైంది.

గులాబీలో 'గుర్తింపు' గుబులు

- అప్పుడే ఎన్నికలకు వెళ్లాల్సి ఉండేదని భావన
- కోర్టుకు వెళ్లి చిక్కుల్లో పడ్డామంటున్న నేతలు
- అసెంబ్లీ ఎన్నికల్లో చేదు ఫలితాలతో డీలా
- టీబీజీకేఎస్‌లో అంతర్మథనం



శ్రీరాంపూర్: సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలపై టీబీజీకేఎస్ నేతల్లో గుబులు మొదలైంది. అసెంబ్లీ ఎన్నికల్లో చేదు ఫలితాలతో యూనియన్ నేతల్లో చర్చ జరుగుతోంది. అసెంబ్లీ ఎన్నికల తర్వాతే గుర్తింపు సంఘం ఎన్నికలకు వెళ్లాలనే ఉద్దేశంతో ఎప్పుడో జరగాల్సిన ఎన్నికల వాయిదాకు కోర్టుకు వెళ్లడాన్ని పెద్ద తప్పిదమనే భావన నాయకుల్లో వ్యక్తమవుతోంది. ఎన్నికల్లో మాతృ పార్టీ బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తుందని, అప్పుడు ఎమ్మెల్యేల బలం, ప్రభుత్వ అండగా సింగరేణి ఎన్నికలకు వెళ్తే క్లీన్‌స్వీప్ చేయవచ్చనే అంచనా తారుమారైంది. సింగరేణి వ్యాప్తంగా ఉన్న 11 ఏరియాల్లోని 11అసెంబ్లీ స్థానాల్లో ఒక్కటి మాత్రమే బీఆర్‌ఎస్ గెలుచుకుంది. తొమ్మిది స్థానాల్లో కాంగ్రెస్, ఒక స్థానంలో సీపీఐ గెలుపొందాయి. ఈ నెల 27న గుర్తింపు సంఘం ఎన్నికల ఉండగా.. పార్టీ ఎమ్మెల్యేల తోడు లేకపోవడం, అధికారంలో కూడా పార్టీ లేని సమయంలో ఎలా జయిస్తామని ఆందోళన చెందుతున్నారు. ఇన్నాళ్లు పార్టీ ఎమ్మెల్యేలు, ప్రభుత్వ పెద్దల బలంతో గెలుస్తామని ధీమా ఉండగా నేటి పరిణామాలు ఇబ్బందికరంగా మారాయి.

పార్టీ నాయకత్వమే కారణం..!

ఈ దీనావస్థకు పార్టీ నాయకత్వమే కారణమని టీబీజీకేఎస్ నాయకులు నిట్టూరుస్తున్నారు. ఎన్నికలపై నిర్ణయం తీసుకునే స్వేచ్ఛను యూనియన్‌కు ఇవ్వకుండా పార్టీనే నిర్ణయం తీసుకోవడతోనే పరిస్థితి వచ్చిందని వాపోతున్నారు. ఆరోసారి గుర్తింపు సంఘం ఎన్నికల్లో 2017 అక్టోబర్ 5న జరిగాయి. కాల పరిమితి నాలుగేళ్లు కాగా.. ఈ సమయం మించి అదనంగా రెండేళ్లు దాటింది. గతేడాది ఎన్నికలు జరగాల్సి ఉండగా అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు సుముఖత చూపలేదు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు సింగరేణి ఎన్నికలు నిర్వహిస్తే చేదు ఫలితాలు వస్తే ఆ ప్రభావం సింగరేణి ప్రభావిత ఆరు జిల్లాల్లోని 11 అసెంబ్లీ స్థానాలపై పడుతుందనే భ్రమలో అడ్డుపడిందనే ఆరోపణలున్నాయి. దీనిపై ప్రతిపక్ష సంఘాలు నిరసన వ్యక్తం చేస్తూ వచ్చాయి. కేంద్ర సీఎల్సీకి లేఖ రాసి ఎన్నికలు వెంటనే నిర్వహించాలనే ఒత్తిడి తెచ్చాయి. అయినా ప్రభుత్వ పెద్దల సూచనతో కంపెనీ పట్టించుకోలేదు. ఎన్నికల నిర్వహణ కోసం ఏఐటీయూసీ 2022 నవంబర్‌లో కోర్టును ఆశ్రయించడం, మూడు నెలల్లో ఎన్నికలు నిర్వహించాలని 2023 ఫిబ్రవరిలో కంపెనీని, డెప్యూటీ సీఎల్సీని ఆదేశించడం తెలిసిందే. దీనిపై అప్పటి ప్రభుత్వం మళ్లీ కంపెనీతో మరో కేసు వేయించింది. ఎన్నికలు నిర్వహిస్తే బొగ్గు ఉత్పత్తిపై ప్రభావం పడుతుందని, జూన్ తర్వాత ఎన్నికలు నిర్వహించాలని కోరగా కోర్టు అంగీకరించింది. కోర్టు ఆదేశాల మేరకు డెప్యూటీ సీఎల్సీ అక్టోబర్ 28న ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేపట్టారు. ఎన్నికల నోటిఫికేషన్, షెడ్యూల్ విడుదల చేశారు. నామినేషన్ల ప్రక్రియ కూడా ముగిసింది. మళ్లీ ప్రభుత్వ పెద్ద జోక్యం చేసుకోవడం కంపెనీ హైకోర్టును ఆశ్రయించింది. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సింగరేణి ఎన్నికల నిర్వహణకు కలెక్టర్లు సుముఖంగా లేరని పేర్కొనడంతో ఈ నెల 27కు వాయిదా వేసింది.

అప్పుడే నిర్వహిస్తే గెలిచే వాళ్లమే..!

అప్పుడే ఎన్నికలు నిర్వహిస్తే రాష్ట్రంలో అధికారంలో ఉన్నందున కొంచెం కష్టపడితే గెలిచే వాళ్లమని ఆ యూనియన్ నేతలు పేర్కొంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల భయంతో పార్టీ తప్పటడుగు వేసిందని మదనపడుతున్నారు. యూనియన్ వ్యవహారాల్లో పార్టీ అతిగా జోక్యంతోనే నేడు ఈ దుస్థితి ఏర్పడిందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. పార్టీ ప్రయోజనాల కోసం చూసి నష్టం చేశారని యూనియన్ ఆవిర్భావం నుంచి పని చేసిన కొందరు నేతలు వాపోతున్నారు. 'గుర్తింపు' ఎన్నికల్లో కార్మికులు ఎవరికి పట్టం కడుతారో వేచి చూడాల్సిందే.

పీఎస్సార్‌కు మంత్రి పదవి?

- పోటీలో ఉన్న 'గడ్డం' సోదరులు
- కొత్త కేబినెట్‌లో చోటుపై చర్చ
- ఆశల పల్లకిలో సీనియర్ నాయకులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: తెలంగాణ రాష్ట్ర మూడో శాసనసభలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి మంత్రి పదవి ఎవరిని వరిస్తుందోనని నాయకులు ఆశల పల్లకిలో ఉన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరనున్న తరుణంలో కొత్త మంత్రివర్గం ఏర్పాటు కానుంది. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లా నుంచి ఎవరికి చోటు దక్కుతుందోనని సర్వత్రా ఆసక్తి మొదలైంది. ఈ మేరకు సీనియర్ నాయకుల ఎంపిక కోసం కసరత్తు జరుగుతోంది. సోమవారం సాయంత్రమే సీఎల్పీ నేత ఎన్నిక, కొత్త ముఖ్యమంత్రి, మంత్రులు ప్రమాణ స్వీకారం ఉంటుందని అంతా భావించారు. చివరికి సీఎం ఎంపికపై ఇంకా ఏకాభిప్రాయం కుదరకపోవడంతో జాప్యం జరుగుతోంది. కొత్త సర్కారులో ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి ఎవరు ప్రాతినిధ్యం వహిస్తారనేది తేలాల్సి ఉంది. ఉమ్మడి జిల్లా నుంచి బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో నిర్మల్ నుంచి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఆదిలాబాద్ నుంచి జోగు రామన్న మంత్రులుగా ప్రాతినిధ్యం వహించారు. ఆ సమయంలో పశ్చిమ జిల్లా నుంచే ఇద్దరికి అవకాశం వచ్చింది. కేబినెట్ హోదా ఉన్న ప్రభుత్వ విప్ పోస్టు మాత్రం తూర్పు జిల్లాకు ఇచ్చారు. ఈసారి పశ్చిమ జిల్లా నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎవరూ లేరు. మంచిర్యాల జిల్లా పరిధిలోనే ముగ్గురు ఎమ్మెల్యేలు, ఖానాపూర్ పరిధిలో మరొకరు ఉన్నారు. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ గెలిచిన స్థానాలైన మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూరు, ఖానాపూర్ ఎమ్మెల్యేలకే కొత్త కేబినేట్‌లో చోటు దక్కనుంది. ఉమ్మడి జిల్లా నుంచే ఇద్దరిని మంత్రులుగా ఎంపిక చేస్తే 'గడ్డం' సోదరుల్లో ఒకరు, మరొకరు పీఎస్సార్ ఉండనున్నారు.

పోటీలో 'గడ్డం' బ్రదర్స్

నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో ఇద్దరు గడ్డం సోదరులైన వినోద్, వివేక్ మంత్రి రేసులో ఉన్నారు. వీరిలో ఒకరికి వచ్చే అవకాశాలు ఉన్నాయని అనుచరులు చెప్పుకుంటున్నారు. చెన్నూరు నుంచి 2004 నుంచి 2009మధ్య దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ప్రభుత్వంలో గడ్డం వినోద్ మంత్రిగా పని చేశారు. తాజాగా వినోద్ బెల్లంపల్లి నుంచి ఎన్నికయ్యారు. వివేక్ తొలిసారిగా చెన్నూరు నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. గతంలో పెద్దపల్లి నుంచి ఎంపీగా పని చేశారు.



పీఎస్సార్



వివేక్



వినోద్



వెడ్మ బొజ్జు

పీఎస్సార్‌వైపు మొగ్గు?

టీపీసీసీ ఎన్నికల వ్యూహ రచన కమిటీ చైర్మన్‌గా ఉన్న మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు పార్టీ పరిశీలనలో ఉండనున్నారు. ఉమ్మడి జిల్లాలో పార్టీ అధికారంలో లేనప్పుడు కష్టకాలంలో వెన్నంటే ఉండి బలోపేతం చేశారు. పది నియోజకవర్గాల్లోనూ ఆయనకు పట్టు ఉంది. పార్టీ పీఎస్సార్ పేరును ప్రధానంగా పరిశీలన చేస్తున్నట్లు చెబుతున్నారు. కేబినెట్ బెర్త్ ఖాయమని ఆయన వర్గీయులు విశ్వాసంగా ఉన్నారు. ఇక ఖానాపూర్ స్థానం నుంచి ఎన్నికైన ఆదివాసీ నాయకుడు, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు మంత్రి పదవిపై ఆశలు ఉన్నాయి.

క్లుప్తంగా

పురుగుల మందు తాగి యువతి ఆత్మహత్య

చింతలమానెపల్లి: పురుగుల మందుతాగి యువతి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్‌హెచ్‌వో యాదవ్ వివరాల ప్రకారం... మండలంలోని రవీంద్రనగర్ గ్రామానికి చెందిన ఊర్మిళ మండల్(21) 10వ తరగతి పూర్తి చేసి ఇంటి వద్ద ఉంటోంది. ఈ నెల 2న తల్లిదండ్రులు వ్యవసాయ పనుల కోసం ఇంటి నుంచి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేసరికి ఇల్లు అస్తవ్యస్తంగా ఉండడంతో తండ్రి కేనార్ మండల్ కూతుర్ని మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన ఊర్మిళ పురుగుల మందు తాగింది. వాంతులు చేసుకోగా గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం ఈస్‌గాం తరలించారు. పరిస్థితి విషమించి ఆదివారం రాత్రి మృతి చెందింది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో వివరించారు.

మేకల కాపరి మృతి

తిర్యాణి: మూర్ఛవ్యాధితో మేకల కాపరి మృతిచెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై రమేశ్ వివరాల ప్రకారం... మండలంలోని చిన్న అరటిపెల్లి గ్రామానికి చెందిన ఏదుల పోషం గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో ఈ నెల 29న మేకలను మేపడానికి వెళ్లాడు. అక్కడే పోషంకు మూర్ఛరావడంతో అక్కడికక్కడే మరణించాడు. మృతుడి ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు గాలించగా సోమవారం అటవీ ప్రాంతంలో మృతదేహం కనిపించింది. మృతుడి భార్య ఏదుల పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమెదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని పాత మంచిర్యాల బస్టాప్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జగదీష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... స్థానిక పాత మంచిర్యాలకు చెందిన బోయిని శేఖర్‌తో పాటు మరికొంత మందిపై అదే ప్రాంతానికి చెందిన పెంట సాయి, రవిలు మరికొంత మందితో కలిసి శేఖర్‌తో పాటు మరికొంత మందిపై దాడికి పాల్పడినట్లు తెలిపారు. శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

విద్యుత్‌షాక్‌తో ఎద్దు మృతి



మృతి చెందిన ఎద్దు

జన్నారం: జన్నారం మండలం రాంపూర్ గ్రామం ఏమూల రమేశ్‌కు చెందిన ఎద్దు సోమవారం సాయంత్రం విద్యుత్‌షాక్‌తో మృతి చెందింది. బాధితుడి వివరాల ప్రకారం... ఎద్దును మేత కోసం వదిలేయగా తిమ్మాపూర్ శివారులోని ట్రాన్స్‌ఫార్మర్‌కు తాకడంతో షాక్‌కు గురై మృతి చెందింది. ఎద్దు విలువ రూ. 60 వేలు ఉంటుందని, అధికారులు స్పందించి పరిహారం అందేలా చూడాలని బాధిత రైతు వేడుకుంటున్నాడు.

పాలు కల్తీ..

- గేదెపాలు పేరుతో ప్యాకెట్ పాల విక్రయం
- ఆహార పదార్థాల్లో పెరిగిన కల్తీ..
- ప్రజా ఆరోగ్యాన్ని పట్టించుకోని అధికారులు

చెన్నూర్: రోజురోజుకూ ఆహార పదార్థాలు కల్తీమయం అవుతున్నాయి. ఉప్పు, పప్పుల దగ్గర నుంచి అన్ని రకాల నిత్యావసర వస్తువుల్లో కల్తీ జోరు పెరిగింది. మేమేమి తక్కువనా అంటూ పాల వ్యాపారులు సైతం కల్తీ వ్యాపారానికి తెరలేపారు. స్వచ్ఛమైన పాలు విక్రయించాల్సిన వ్యాపారులు కల్తీ పాల వ్యాపారం సాగిస్తున్నారు. కొందరు పాల వ్యాపారులు గేదెపాల పేరుతో ప్యాకెట్ పాలు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. స్వచ్ఛమైన గేదె, ఆవు పాలలో ఎన్నో పోషకాల విలువ లున్నాయి. పాలను సంపూర్ణ ఆహారంగా భావించి సేవిస్తున్నారు. సంపూర్ణ ఆహారాన్ని సైతం కల్తీ కాకుండా చూడాల్సిన అధికారులు నిద్రవస్థలో ఉన్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

సంపూర్ణ ఆహారంలో కల్తీ..

ఆరోగ్యంగా ఉన్నవారి దగ్గర నుంచి అనారోగ్యంగా ఉన్న చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకూ సంపూర్ణ ఆహారం అంటే పాలే. నాణ్యమైన పాలను కొనుగోలు చేసి సేవిస్తున్నామని ప్రజలు నమ్ముతున్నారు. ప్రజల అవసరాలను ఆసరా చేసుకొని కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. గేదె పాలు చెప్పి వివిధ రకాల పాలు విక్రయిస్తున్నారు. కొందరు గేదె పాల పేరుతో పౌడర్‌లో నీళ్ల కలిపి విక్రయిస్తున్నారు. మరికొందరు ప్యాకెట్ పాలను గేదె పాలల్లో కల్పి అమ్ముతున్నారు. ప్రజలు గేదె పాలు కొనుగోలు చేస్తున్నామని నమ్ముతున్నారు. ప్రజల నమ్మ



చెన్నూర్‌లో గేదె పాల విక్రయించే వ్యక్తి బాటిళ్లలో ప్యాకెట్ పాలు కలుపుతున్న దృశ్యం

కాన్ని కొందరు వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కల్తీ నియంత్రణ చర్యలేవి..

ఆహార పదార్థాల కల్తీ నియంత్రణలో అధికారులు విఫలమయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మార్కెట్‌లో నిత్యం కల్తీ వ్యాపారం జోరుగా సాగుతున్న అధికారులు పట్టిచుకోవడం లేదు. ప్రధానంగా వ్యాపారులు పట్టణ, మున్సిపాలిటీలలో ఈ కల్తీ దందాలు సాగిస్తున్నారు. పాలను సైతం కల్తీ జరుగుతున్నా అధికార యంత్రాంగానికి చలనం లేకుండా పోయిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. జిల్లాలో సుమారు 9లక్షల పై చిలుకు జనాభా ఉంది. జనాభాకు సరిపడా పాడి సంపద లేదు. పాడి పశువుల ద్వారా సేకరించిన పాలతో పాటు జిల్లాలో సుమారు 60వేల లీటర్ల వివిధ రకాల కంపెనీలకు చెందిన ప్యాకెట్ పాలు విక్రయాలు జరుగుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. అధికారులు ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని కల్తీ పాల విక్రయాలను నియంత్రించాలని కోరుతున్నారు.

కల్తీని నియంత్రించాలి



రోజురోజుకూ ఆహార పదార్థాలలో కల్తీ పెరిగింది. కొన్ని ప్రాంతాల్లో పాలకు వివిధ రకాల రసాయనాలు కల్పి విక్రయిస్తున్నారు. వివిధ పట్టణాలలో పాలు సైతం కల్తీ చేస్తున్నట్లు వింటున్నాం. జిల్లాలోని ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులు కల్తీ పదార్థాల నియంత్రించాలి. నాణ్యమైన ఆహార పదార్థాలు ప్రజలకు అందేలా చర్యలు చేపట్టాలి.

–చెన్నూరి నవీన్, యువకుడు చెన్నూర్

బడిలో సేంద్రియ సాగు..



పాఠశాల ఆవరణలో సాగు చేసిన కొత్తిమీర, వెల్లుల్లి



బీర కాయలను చూపిస్తున్న హెచ్‌ఎం శ్రీలత

- సత్ఫలితాలనిస్తున్న పెరటితోటల పెంపకం...

దండేపల్లి: మనిషి ఆరోగ్యంగా ఉండడానికి క్రమం తప్పకుండా శాఖాహారం తీసుకోవాలని నిపుణులు చెబుతుంటారు. వీటిలో ప్రధానమైనవి తాజా కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు ఉంటాయి. నేటి జనాభా డిమాండ్‌కు తగ్గట్టుగా పంట ఉత్పత్తులు సరిపోకపోవడంతో తక్కువ సమయంలో ఎక్కువ దిగుబడులు సాధించేందుకు వివిధ రకాల రసాయన ఎరువులు వినియోగించి కూరగాయలు పండిస్తున్నారు. ఇలాంటి సమయంలో ప్రజలను ప్రత్యామ్నాయ మార్గాల వైపు మళ్లించేందుకు ప్రభుత్వం పెరటి తోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తోంది. దండేపల్లి మండలంలోని పెద్దపేట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత, పాఠశాల ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు అందరూ కలిసి పాఠశాల ఆవరణలో గల ఖాళీ స్థలంలో పెరటితోటలు పెంచుతున్నారు. వీరుచేపట్టిన పెరటి తోటల సాగు మంచి సత్ఫాలితాలనిస్తుందని ప్రధానోపాధ్యాయురాలు చెబుతున్నారు.

కూరగాయలు, ఆకు కూరలు...

పాఠశాలలో 52మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో బాగంగా పాఠశాల విద్యార్థులకు తాజా ఆకు కూరలు, కూరగాయలతో భోజనం వండిపెట్టేందుకు, పాఠశాలలోని పెరటి తోటలో టమాట, మిర్చి, వంకాయ, ఆకుకూరలు, చిక్కుడు కాయ, బీరకాయలు పండిస్తున్నారు. వీటితో పాటు పోపులో ఉపయోగించేందుకు వెల్లుల్లి ఆకులు, కొత్తిమీర ఆకు, వంటి రకాలను పెరటి తోటలో సాగు చేస్తున్నారు. పెరటితోటలో సాగుచేస్తున్నవి సరిపోని సమయంలో వారసంతలోని కూరగాయలు కొనుగోలు చేస్తారు. పెరటితోట సాగులో పాఠశాలలో పనిచేసే ప్రధానోపాధ్యాయురాలితో పాటు, ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు కూడా పాల్పంచుకుంటున్నారు. పైగా పెరటితోటల సాగుపై పాఠశాల విద్యార్థులకు కొంత అవగాహన కూడా కల్పిస్తున్నట్లు హెచ్‌ఎం తెలిపారు.

గుంతను తప్పించబోయి..

- చెట్టును ఢీకొన్న లారీ..
- డ్రైవర్ అక్కడికక్కడే మృతి

రాయపర్తి: గుంతను తప్పించబోయిన లారీ చెట్టుకు ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ లారీ కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రం శివారులోని కేసీఆర్ కాలనీ సమీపంలో జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం మంచిర్యాల జిల్లా నెన్నెల మండల కేంద్రానికి చెందిన ఎండీ అఫ్రోజ్(50) ధాన్యంలోడ్‌తో తొర్రూరు వైపునకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో కేసీఆర్ కాలనీ సమీపంలో గుంతను తప్పించబోయి వరంగల్-ఖమ్మం జాతీయ రహదారి



బోల్తాపడిన లారీ

పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టి బోల్తాపడింది. దీంతో లారీ కింద పడిన డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు జేసీబీ సాయంతో లారీని పైకి లేపి డ్రైవర్‌ను తీశారు. మృతదేహం పూర్తిగా నుజ్జునుజ్జయింది.

గుర్తింపు సంఘం ఎన్నికలకు సిద్ధం కావాలి

మందమర్రిరూరల్: సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలకు కార్మిక లోకం సిద్ధం కావాలని ఏఐటీయూసీ మందమర్రి బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ పిలుపునిచ్చారు. సోమవారం ఏరియాలోని వర్క్‌షాపులో కార్మికులను కలిసి మాట్లాడారు. కార్మిక హక్కుల సాధనలో ముందుండే ఏఐటీయూసీని గెలిపించుకోవాలని కోరారు. సింగరేణిలో సర్కారు సంఘాలను గెలిపించుకుంటే కార్మికులకు ఇబ్బందులు తప్పవని అన్నారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు సుదర్శన్, బానయ్య, తిరుపతి, రాజేశం, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎల్పీ సమావేశానికి బొజ్జు

కడెం: హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలోని ఎల్లా హోటల్‌లో పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సీఎల్పీ సమావేశానికి ఖానాపూర్ నియోజవర్గ ఎమ్మెల్యేగా గెలిచిన వెడ్మ బొజ్జు హాజరయ్యారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మానిక్‌రావుఠాక్రే, డి.కే శివకుమార్, గెలిచిన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు హాజరైనట్లు పేర్కొన్నారు.



సమావేశంలో వెడ్మ బొజ్జు

సోషల్ మీడియా... సైలెంట్

- ఎన్నికల ప్రక్రియపూర్తి
- సామాజిక మాధ్యమాలు నిశ్శబ్దం...

నిర్మల్‌ఖిల్లా: గత నెల ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచి జిల్లాలో ఉధృతంగా కొనసాగిన ప్రచారంతో పాటు సామాజిక మాధ్యమాల్లో కూడా ముమ్మరంగా ప్రచార భేరి మోగించారు. సోషల్ మీడియా ఇన్‌చార్జిలను నియమించి మరీ జిల్లాలోని ప్రధాన పార్టీలన్నీ మేనిఫెస్టోలు, అభ్యర్థుల గుణగణాలను విస్తృతంగా ప్రచారం చేశారు. కార్యక్రమాల వివరాలను వాట్సాప్, పేస్‌బుక్, ఇన్స్టాగ్రామ్ వంటి మాధ్యమాల్లో ఎప్పటికప్పుడు అప్లోడ్ చేస్తూ బిజీబిజీగా గడిపారు. అయితే ఆదివారం ఫలితాలు తేటతెల్లం కావడంతో సోషల్ మీడియా స్తబ్దుగా మారింది. ఇన్ని రోజులు ప్రధాన రాజకీయ పార్టీల సోషల్ మీడియాల ఇన్‌చార్జిలు ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకోవడం, కామెంట్ల రూపంలో వాదనలు కొనసాగడం జరిగాయి. ఒకరు పెట్టిన సోషల్ మీడియా పోస్టుకు ప్రత్యర్థి పార్టీల అనుచరులు స్పందిస్తూ విమర్శల రూపంలో కామెంట్లు చేసుకున్నారు. దానికి మళ్లీ ప్రతిస్పందనలు రావడం ఇలా వాద, ప్రతివాదనలు సోషల్ మీడియాలో జోరుగా కొనసాగాయి. ఫలితాలు వెల్లడి అనంతరం ఓటమి చెందిన అభ్యర్థుల అనుచర వర్గం సైలెంట్ అయిపోయింది. గెలిచిన అభ్యర్థుల అనుచరులు విజయ యాత్రల పేరిట ఆదివారం రాత్రి వరకు పలు ప్రాంతాల్లో డీజేల మోతలు మోగించారు. గెలిచినా, ఓడినా హుందాగా ఉండడమే బెటరని తటస్తులు సూచిస్తున్నారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని వాటిని ప్రతిష్టాత్మకంగా తీసుకొని అనుచరులు, కార్యకర్తలు, యువత వివాదాలు సృష్టించుకోవద్దని కోరుతున్నారు.

ప్రజల హృదయాలను గెలుచుకున్నావు..

- కేటీఆర్‌ను కలిసిన జాన్సన్ నాయక్

ఉట్నూర్‌రూరల్: రాజకీయాల్లో గెలుపోటములు సహజమని ఎన్నికల్లో ఓడిపోయిన ఖానాపూర్ ప్రజల హృదయాలను గెలుచుకున్నావని ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్‌ను కేటీఆర్ అభినందించారు. జాన్సన్‌నాయక్ సోమవారం హైదరాబాద్‌లో కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. దీంతో కేటీఆర్ ఎన్నికల సరళిని అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల్లో మంచి ఓట్లు సాధించి ప్రజల హృదయాలను గెలుచుకున్నావని కొనియాడారు. ఓటమితో అసంతృప్తి చెందకుండా రానున్న రోజుల్లో గెలుపే లక్ష్యంగా ముందుకెళ్లాలన్నారు.



కేటీఆర్‌తో జాన్సన్‌నాయక్

మంత్రివర్గంలో వివేక్‌కు చోటు కల్పించాలి

ఆదిలాబాద్‌రూరల్: మాల, మాల ఉపకుల సామాజిక వర్గం నుంచి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని చెన్నూర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన గడ్డం వివేక్‌కు గతంలో ఎంపీగా చేసిన అనుభవం ఉందని, మంత్రివర్గ విస్తరణలో చోటుకల్పించాలని భారతీయ బౌద్ధ మహాసభ ఉత్తర తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నజాడే ప్రజ్ఞాకుమార్ కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మహా ప్రజ్ఞా బుద్ధ వీహార్ ప్రాంగణంలో భారతీయ బౌద్ధ మహాసభ, షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంస్థ, మాల యువసేన అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీల అభివృద్ధికి కృషి చేస్తుందని నమ్ముతున్నామన్నారు. ఈ సమావేశంలో షెడ్యూల్డ్ కులాల



సమావేశంలో మాట్లాడుతున్న ప్రజ్ఞాకుమార్

హక్కుల పరిరక్షణ సంస్థ జిల్లా యూత్ అధ్యక్షులు మస్కే రాజు, మాల యువసేన జిల్లా అధ్యక్షులు ఆర్ ఉదయ్ కుమార్, సంఘమిత్ర వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి పటాడే రాజు, వికలాంగుల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్, నాయకులు సుఖదేవ్, సురేష్, బోరేకర్ నందు కుమార్, మూడే ప్రమోద్, ఆర్ విశ్వనాథ్, తాడే రాహుల్, జాడే సిద్ధార్థ, వసంత్ ఉన్నారు.

పురుగుల మందుతాగి చిరు వ్యాపారి ఆత్మహత్య



మారుతి (ఫైల్)

జైనూర్: తాగిన మైకంలో పురుగుల మందు తాగి చిరువ్యాపారి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై సందీప్‌కుమార్ వివరాల ప్రకారం... మండలంలోని బాలాజీనగర్‌కు చెందిన గాయక్‌వాడ్ మారుతి(55) సోమవారం రాత్రి కొడుకుతో మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వాలని గొడవపడ్డాడు. దీంతో భావోద్వేగానికి గురై పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య ఉజ్వల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భార్య ఆత్మహత్య కేసులో భర్తకు జైలు

భైంసాటౌన్: భార్య ఆత్మహత్యకు కారణమైన కేసులో భర్తకు జైలుశిక్ష విధిస్తూ నిర్మల్ జిల్లా కోర్టు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కె.అజేశ్ కుమార్ సోమవారం తీర్పు వెలువరించారు. వివరాలి లా ఉన్నాయి.. భైంసా పట్టణంలోని ఓవైసీనగర్‌కు చెందిన బబ్లూ ఖురేషి మద్యానికి బాని సై భార్య అక్బరిబేగంను తరచూ కొట్టేవాడు. ఈ క్రమంలో మనస్తాపానికి గురై 2021లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్ప డింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్సై సాదిక్‌హుస్సేన్ కేసు నమోదు చేశాడు. సోమవారం కోర్టులో సాక్షులను ప్రవేశపెట్ట గా నేరం రుజువు కావడంతో నిందితుడికి ఐ దేళ్ల కఠిన కారాగార జైలుశిక్షతోపాటు రూ.2వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

పార్టీ మారే... పదవి వరించే

- ఉమ్మడి జిల్లాలో పలువురిని వరించిన అదృష్టం
- అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా గెలుపు

కైలాస్‌నగర్: రాజకీయంలో ఎమ్మెల్యే, ఎంపీ పదవులు ఎప్పుడు ఎవరిని వరిస్తాయనేది చెప్పలేం. ఒక్కొక్కరు ఏళ్లుగా ఎంతో కష్టపడినప్పటికీ వారికి ఎలాంటి పదవులు దక్కవు. కానీ కొంతమందికి కష్టపడాల్సిన అవసరం లేకుండానే అదృష్టం వరిస్తోంది. రాజకీయంగానూ పదవులు వారి సొంతమవుతాయి. ఇలాంటి కొవకే చెందిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పలువురు నాయకులను ఎమ్మెల్యే పదవి వరించింది. ఏళ్లుగా ఒక పార్టీలో కొనసాగి సీనియర్లుగా ముద్రపడడంతో పాటు ఆ పార్టీ తరఫున ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలైన నాయకులకు కండువా మార్పు ఈ ఎన్నికల్లో కలిసి వచ్చింది. తాజాగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో పార్టీలు మారిన నాయకులకు ప్రజలు మద్దతుగా నిలిచారు. వారిని ఆశీర్వదించి అసెంబ్లీకి పంపించారు. ఆదివారం వెల్లడైన ఎన్నికల ఫలితాల్లో ముగ్గురు నాయకులు ఎమ్మెల్యేలుగా విజయం సాధించారు. వారేవరనేదాన్ని పరిశీలిస్తే...



సిర్పూర్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీచేసిన పాల్వాయి హరీష్‌బాబు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కోనేరు కొనప్పపై 3043 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. అంతకు ముందు కాంగ్రెస్ పార్టీలో పనిచేసిన ఆయన 2018 ఎన్నికల్లో అదే పార్టీ తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేసి రెండో స్థానంలో నిలిచారు. తాజాగా కాంగ్రెస్‌ను వీడి బీజేపీ తరఫున పోటీ చేసిన ఆయన కొనప్పను ఓడించి తొలిసారి అసెంబ్లీలోకి అడుగుపెడుతున్నారు.



నిర్మల్ మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నా య కులు. ఆ పార్టీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడిగానూ సేవలందించారు. 2018లో కాంగ్రెస్ అభ్యర్థిగా నిర్మల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి రెండో స్థానంలో నిలిచారు. పార్టీలో ఏర్పడ్డ పరిస్థితుల కారణంగా ఈ ఏడాది ఏప్రిల్ 23న కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరారు. అదే నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా బరిలోకి దిగిన ఆయన మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డిపై 50,703 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించి రెండోసారి అసెంబ్లీకి వెళ్లనున్నారు.



ఈ నెల 3వ తేదీన ప్రకటించిన ఫలితాల్లో ముథోల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన పవార్ రామారావు పాటిల్ సైతం కాంగ్రెస్‌లో కొనసాగారు. ఆ పార్టీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడిగానూ సేవలందించారు. గతేడాది నవంబర్ 22వ తేదీన కాంగ్రెస్‌ను వీడి బీజేపీ పార్టీలో చేరాడు. పార్టీలో తనకంటూ గుర్తింపు తెచ్చుకోవడంతో పాటు ప్రజల్లోనూ పలుకుబడి ని సంపాధించుకున్నారు. బీజేపీ అభ్యర్థి గా పోటీ చేసిన ఆయన ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డిపై 23,419 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించి తొలిసారి అసెంబ్లీలోకి అడుగిడుతున్నారు.



కాంగ్రెస్ పార్టీ నుంచి పెద్దపల్లి ఎంపీగా పనిచేసిన జి. వివేక్ వెంకటస్వామి అనంతరం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆ పార్టీలో జరిగిన పరిణామాలతో ఆ పార్టీని వీడి బీజేపీలో చేరారు. ఆ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో కమిటీ చైర్మన్‌గా ఉన్నటువంటి ఆయన ఈ ఏడాది నవంబర్ 1వ తేదీన అనూహ్యంగా బీజేపీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఆ పార్టీ తరఫున చెన్నూర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన ఆయన తన ప్రత్యర్థి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై 36,618 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించి తొలిసారిగా అసెంబ్లీకి వెళ్లనున్నారు.

కాంగ్రెస్ శ్రేణుల బాహాబాహీ

- ఎమ్మెల్యే వినోద్ జన్మదిన వేడుకల్లో ఘర్షణ

బెల్లంపల్లి: ఎమ్మెల్యే గడ్డం వినోద్ జన్మదిన వేడుకల్లో కాంగ్రెస్ శ్రేణులు బాహాబాహీకి దిగిన ఘటన సోమవారం బెల్లంపల్లిలో చోటుచేసుకుంది. కేక్ కట్ చేసే క్రమంలో ఇరువురు నాయకుల మధ్య మనస్పర్థలు వచ్చి కార్యకర్తల ముందే దూషించుకున్నారు. ఒకరినొకరు తోపులాడుకుని తన్నుకునే వరకు వెళ్లారు. బెల్లంపల్లి ఎమ్మెల్యేగా వినోద్ గెలిచి 24గంటలు కూడా గడవక ముందే కాంగ్రెస్ నాయకులు ఆధిపత్యం కోసం తగువులాడుకోవడం పురప్రజలను తీవ్ర విస్మయానికి గురిచేసింది. పట్టణ కాంగ్రెస్ కార్యాలయంలో ఎమ్మెల్యే వినోద్ జన్మదిన వేడుకలను ఏర్పాటు చేశారు. ముందుగా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్య కేక్ కట్ చేశారు. ఆ తర్వాత కొద్దిసేపటికి మున్సిపల్ మాజీ చైర్మన్ మత్తమారి సూరిబాబు వచ్చారు. అప్పటికే జన్మదిన వేడుకలు పూర్తి కావడంతో సూరిబాబు వర్గీయులు మరో కేక్‌ను తీసుకొచ్చి కట్ చేసేందుకు సిద్ధపడ్డారు. అంతలోనే మల్లయ్య ముందుకు దూసుకొచ్చి కాంగ్రెస్ కార్యాలయంలో ఒకసారి మాత్రమే కేక్ కట్ చేయాలని, రెండోసారి వేడుకలను నిర్వహించవద్దని సూరిబాబు వర్గీయులను



దూషించుకుంటున్న కాంగ్రెస్ వర్గీయులు

వారించి కేక్‌ను కిందకు తోసేయడంతో గొడవ ప్రారంభమైంది. సూరిబాబు, మల్లయ్యలు పరుష పదజాలంతో దూషించుకుని ఒకరినొకరు నెట్టేసుకున్నారు. ఈ క్రమంలో కార్యకర్తలు రెండు వర్గాలుగా విడిపోయి బాహాబాహికి దిగారు. దీంతో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. అంతలోనే మల్లయ్య అక్కడి నుంచి వెళ్లిపోగా ఆ తర్వాత సూరిబాబు వర్గీయులు కేక్ కట్ చేసి వేడుకలను నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు సమాచారం ఇవ్వకుండా పట్టణ అధ్యక్షుడు మల్లయ్య ఏకపక్షంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలను నిర్వహించడం ఏమిటని సూరిబాబు వర్గీయులు పేర్కొన్నారు. మల్లయ్య తీరు ఏమాత్రం సరిగా లేదని, గొడవ జరగడానికి పట్టణ అధ్యక్షుడు అనుసరించిన తీరే కారణమని పలువురు కాంగ్రెస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకల్లో కాంగ్రెస్ శ్రేణులు పోట్లాడుకోవడంపై పుర ప్రజలు రకరకాలుగా చర్చించుకున్నారు.